# నెలనెలా తెలుగు వెన్నెల

## టాన్‌టెక్స్ పదవ సమావేశం

ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం వారి తెలుగు సాహిత్య వేదిక నిర్వహించే 'నెల నెలా తెలుగు వెన్నెల' పదవ సమావేశం డల్లాస్ నగరంలోని హిందూ దేవాలయంలో మే 19న జరిగింది. సాహితీప్రియులు ఆహూతులయిన ఈ కార్యక్రమానికి తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర అధ్యక్షత వహించగా, డల్లాస్ నగరానికి చెందిన ప్రముఖ నియోనాటాలజిస్ట్ డాక్టర్ నక్తా రాజు ప్రధానవక్తగా పాల్గొని, శంకరమంచి సత్యం రచించిన 'అమరావతి కథలు' అనే అంశంపై ప్రసంగించారు.



డాక్టర్ నక్తా రాజును శ్రీధర్ కొర్సపాటి, అనంత్ మల్లవరపు జ్ఞాపికతో సత్కరిస్తున్న దృశ్యం

కార్యక్రమానికి హాజరైన అతిధులకు, సభ్యులకు ప్రసాద్ తోటకూర స్వాగతం పలకగా, సాహిత్యవేదిక వ్యవస్థాపక సభ్యుడు ఎమ్వీయల్ ప్రసాద్ ముఖ్య అతిథి నక్తా రాజును సభకు పరిచయం చేశారు. డాక్టర్ రాజు అమరావతి కథల్ని విశ్లేషిస్తూ, కృష్ణా నది పరిసర ప్రాంతాల్ని, అమరావతి గ్రామీణ సౌందర్యాన్ని కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు. ఒక్కో కథ సారాంశాన్ని వివరిస్తూ, ప్రస్తుత సమాజంలో తరిగిపోతున్న అనుబంధాల్ని, పెరిగిపోతున్న ఆంతరాల్ని అమరావతి కథల కోణంలో విశ్లేషిస్తూ శ్రోతల్ని ఆలోచింపజేసే విధంగా ప్రసంగించారు. తర్వాత సాహిత్యవేదిక సభ్యుడు అనంత్ మల్లవరపు రాయప్రోలు రచించిన గేయాల్ని ఆలపించగా, ఈశ్వర రామజోగారావు తన మాతృమూర్తికి అంకిత మిస్తూ రాసిన కవితను చదివారు. మద్దాల శ్రీను 'కారుకూతలు' శీర్షికతో తాను రచించిన సరదా కవితల్ని వినిపించగా, జువ్వాడి రమణ విశ్వనాథ రచన నుండి శివధమనుర్భంగం ఘట్టాన్ని వర్ణించారు. ఆచార్య పుదూర్ జగదీశ్వరన్ శ్రీనాధకవి విరచితమయిన శివరాత్రి మహాత్మ్యం లోని కొన్ని రసవంతమయిన ఘట్టాల్ని వర్ణించి శ్రోతల్ని అలరించారు. సూరిభొట్ల లక్ష్మి అమ్మ మీద తాను రాసిన కవిత వినిపించగా, తాడిమేటి రాధిక మంచుమీద స్వీయకవితను వినిపించారు.



అనంతరం డాక్టర్ నక్తా రాజును టాంటెక్స్ సంస్థ ప్రెసిడెంట్-ఎలక్ట్ శ్రీధర్ కొర్సపాటి, కార్యవర్గ సభ్యుడు అనంత్ మల్లవరపు జ్ఞాపికతో సత్కరించగా, ఎమ్వీయల్ ప్రసాద్ శాలువా కప్పి సన్మానించారు. అన్నపూర్ణ చిలు కూరు, శాంత పులిగండ్ల, ఆచార్య జగదీశ్వరన్, పెలిగండ్ల విశ్వనాథం, ఎమ్వీయల్ ప్రసాద్, రాజారెడ్డి, గీతా దమ్మన్న, రావ్ కల్వల తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం అనంత్ మల్లవరపు వందన సమర్పణతో ముగిసింది.